ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 27.11.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. అంతరిక్ష రంగంలో పలు సంస్కరణల అమలుతో ప్రపంచ పెట్టుబడులకు దేశం గమ్య స్థానంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. హైదరాబాద్ లోని స్కైరూట్ ఏరోస్పేస్ ఇన్ఫినిటీ క్యాంపస్ ను వర్చువల్ గా ప్రధానమంత్రి ప్రారంభించారు.

2. తెలంగాణలో తొలివిడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఎన్నికల సంఘం ఆదేశాలతో అన్ని జిల్లా కేంద్రాల్లో హెల్ప్ లైన్ లు ఏర్పాటు చేశారు.

3. రాష్ట్రంలో 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట లభించింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సీజే ధర్మాసనం సస్పెండ్ చేసింది.

4. రాష్ట్రంలో ఇప్పుడున్న 13 వృద్ధాశ్రమాలకు తోడు.. త్వరలో 37 డే కేర్ సెంటర్లు ప్రారంభించనున్నట్లు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చెప్పారు.

----------------------

**PM - SKYROOT CAMPUS**:

హైదరాబాద్ లోని ప్రతిష్టాత్మక ప్రైవేటు అంతరిక్ష సంస్థ - స్కైరూట్ ఏరోస్పేస్ ఇన్ఫినిటీ క్యాంపస్ ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ గా ఈ ఉదయం ప్రారంభించారు. శంషాబాద్ వద్ద ఏర్పాటు చేసిన ఈ రాకెట్ ఫ్యాక్టరీ భారతదేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రాకెట్ ఫ్యాక్టరీ. అక్కడే తయారయిన మొట్టమొదటి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్-1ను కూడా ప్రధానమంత్రి

లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అంతరిక్ష రంగంలో సంస్కరణల అమలుతో ప్రపంచ పెట్టుబడులకు దేశం గమ్యంగా మారిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సృజనాత్మకతకు, సామర్ధ్యాలకు ప్రైవేటు రంగంలో ప్రోత్సాహం లభించినట్లు చెప్పారు.

**(Soundbyte-PM1)**

దేశ అంతరిక్షరంగం గత 6-7 ఏళ్ళలో ఓపెన్, సహకార, సృజనాత్మక ఆధారిత ఆర్థిక శక్తిగా మారిందని ప్రధానమంత్రి చెప్పారు. ప్రస్తుతం అంతరిక్ష రంగంలో ఉన్న 300 పైగా స్టార్టప్ లు దేశ అంతరిక్ష భవితవ్యానికి కొత్త ఆశాలిస్తున్నాయని పేర్కొన్నారు. అంతరిక్ష రంగ సంస్కరణల స్ఫూర్తితో దేశ ఇంధన భద్రత కోసం అణుశక్తి రంగాన్ని కూడా సంస్కరించి ప్రైవేటు రంగానికి క్రియాశీల భాగస్వామ్యం కల్పించనున్నట్లు ప్రధానమంత్రి చెప్పారు.

**(Soundbyte-PM1)**

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి G కిషన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ అంతరిక్ష యానంలో స్కైరూట్ సువర్ణాక్షర అధ్యాయం అని అన్నారు.

**(Soundbyte-కిషన్ రెడ్డి)**

అంతకుముందు, స్కై రూట్ వ్యవస్థాపకులు పవన్ చందన, భరత్ మాట్లాడుతూ... ప్రతి నెల ఒక రాకెట్ లాంచ్ కు సిద్ధం చేయనున్నట్లు నాలుగు వేల కోట్ల రూపాయిల పెట్టుబడులను ఈ రంగంలో పెట్టనున్నట్లు చెప్పారు.

NSD/MSL

----------------------------

**నోటిఫికేషన్**

తెలంగాణలో తొలివిడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈరోజు నుంచి ఈనెల 29 వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంది. ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు సమర్పించవచ్చు. నోటిఫికేషన్ వెలువడిన ప్రాంతాల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో నామినేషన్లను స్వీకరిస్తున్నారు. ఈనెల 30న వీటిని పరిశీలిస్తారు. వచ్చేనెల 3వ తేదీ వరకు ఉపసంహరణ గడువు ఉంది. తొలిదశలో 4 వేల 236 గ్రామాలు, 37 వేల 450 వార్డుల్లో పోలింగ్

జరుగుతుంది. వచ్చేనెల 3వ తేదీన పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. వచ్చేనెల 11వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం ఓట్లు లెక్కించి వార్డు సభ్యులు, సర్పంచి ఫలితాలు వెల్లడిస్తారు.

జీఎస్

---------------------

**ఎస్టీలు**

కాగా పంచాయతీ ఎన్నికల్లో ఎస్టీలకు రిజర్వు అయిన స్థానాలు పెరిగాయి. 2019లో ఎస్టీ పంచాయతీల సంఖ్య 1177 ఉండగా.. 2025లో అది 1248కు పెరిగింది. నాన్ షెడ్యూల్డు గ్రామ పంచాయతీల్లోనూ ఎస్టీలకు 688 నుంచి 714కు పెరిగాయి. 2019తో పోల్చితే బీసీలకు ఎనిమిది జిల్లాల్లో రిజర్వేషన్లు పెరిగాయి. నాన్ షెడ్యూల్డు పంచాయతీల్లో పెరిగిన ఎస్టీ రిజర్వేషన్లు తదితరాల ప్రభావం ఇతర వర్గాలపై స్వల్పంగా పడింది.

జీఎస్

---------------------------

**హైకోర్టు**

రాష్ట్రంలో 2015 టీజీపీఎస్సీ గ్రూప్-2 ర్యాంకర్లకు హైకోర్టులో ఊరట లభించింది. గ్రూప్-2పై సింగిల్ బెంచ్ ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సస్పెండ్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ బెంచ్ తీర్పును టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేయగా.. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. 2015-16 గ్రూప్-2ను రద్దు చేస్తూ ఇటీవల హైకోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే.

డెస్క్

--------------------------------

**హెల్ప్ లైన్లు**

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో హెల్ప్ లైన్ సెంటర్లు 24 గంటలూ పనిచేస్తాయని ఆయా జిల్లాల కలెక్టర్లు తెలియజేశారు. అంతేకాకుండా.. పలు జిల్లాల్లో చెక్ పోస్టులు కూడా ఏర్పాటు చేశారు. వాహనాల తనిఖీలు ప్రారంభించారు.

డెస్క్/జిల్లాలు

----------------------------

**ఏకగ్రీవాలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవం చేయడానికి పలు గ్రామాల్లో కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే గిరిజన రిజర్వ్ తండాల్లో ఒప్పందాలు జరుగుతున్నాయి. జిల్లాలోని రూప్లా నాయక్ తండా, నాయక్ తండా లలో సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని తండావాసులు తీర్మానించారు. కాగా, తొలి విడత పోరుకు సంబంధించిన ఏర్పాట్లపై ఇన్చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిస్థితిని పరిశీలిస్తున్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మహేష్ బీ గీతే తెలిపారు.

పిటిసి, సిరిసిల్ల

------------------------

**బీజేపీ**

స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యర్థులను రంగంలోకి దించి అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఆయన అధ్యక్షతన నిన్న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేసిన అభ్యర్థులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జీఎస్

---------------------------

**అడ్లూరి**

వృద్ధులకు ఆసరాగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిన్న రాష్ట్రస్థాయి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి అడ్లూరి మాట్లాడుతూ...వయో వృద్దులు గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. జిల్లాల్లో 13 వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేశామని, త్వరలో 37 డేకేర్ సెంటర్లను ప్రారంభిస్తామని చెప్పారు. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమచట్టం-2007 ప్రకారం అన్ని జిల్లాల్లో మెయింటెనెన్స్ ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేశామన్నారు.

జీఎస్

------------------------

R&B

నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాల అమలులో విశేష ప్రతిభ కనబరుస్తూ తెలంగాణ రోడ్లు–భవనాల శాఖ (R&B) జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (NSCI) ప్రకటించిన జాతీయ భద్రతా అవార్డుకు రాష్ట్ర R&B శాఖ ఎంపికైంది. వరంగల్ రంగంపేటలో నిర్మాణం జరుగుతున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల్లో భద్రతా ప్రమాణాలు, పర్యవేక్షణ, కార్మిక భద్రత చర్యలు సమర్థంగా అమలైనందుకు ఈ అవార్డు లభించింది.

జీఎస్

---------------------------